● శ్రీ సుభా

# ఖరీదైన ప్రేమ

సీత అందగత్తెకాదు. బింకంగా బొంకంగా వుండదు. మాటకారి కాదు. హొయలు అసలే తెలియవు. యిరవై రూపాయల విలువచేయని సాదా చీర కట్టుకుని, ఐదురూపాయల ఖరీదుమించని జాకెట్టే తొడుక్కుంటుంది.

ఆమె వూరి యెలిమెంటరీ స్కూల్లో ఐదో తరగతి వరకూ చదివింది. ఆమెకి ఆ యెలిమెంటరీ స్కూలే విశ్వ విద్యాలయం. అపరిమిత విజ్ఞానంలో ఆమెకి ఆమెసాటి-యిచ్చేవాళ్లుంటే ఆ స్కూల్లో డాక్టరేట్ తీసుకోగలిగే అర్హత సీత ఒక్కదానికే వుంది - సీతకి ఆ వూళ్లో హైస్కూలు వుందనీ, చదుకోవచ్చునని మొదట రామం చెప్పాడు....రామం సీతా వాళ్ళ వీధిలో అబ్బాయి. రామం చెప్పిన వార్తలతో విశేషాలతో వుక్కిరి బిక్కిరి అయిపోయిన సీతని నరశింహాచారి బలవంతంగా చదువు మాన్పించి, ఆ పైన ఆమె కట్టుకొన్న పరికిణీ పైన, వద్దన్నా వినకుండా కండువా వేయించి వీధిగుమ్మం దగ్గరే ఆమె బ్రతుక్కో పెద్ద గిరి గీసి పారేశాడు.

సీత ఆ ఐదో తరగతి విజ్ఞానంతోనే వుద్యోగంలో జేరింది.

అది వాళ్ళ పంచలోనే వున్న రామాలయంలో సీతారామ లక్ష్మణులకు దండలు కట్టడం....గుడివూడ్చి ముగ్గులు పెట్టడం.. ఆడదిక్కులేని యింటిలో వంటవార్పులు చూడ్డం అంతే....

ఐదారేళ్ళలో సీతకి తండ్రి నరశింహాచారి గుళ్లోచేసే సేవలన్నీ వంటబట్టాయి. నరశింహాచారి పవళింపు సేవచేస్తూ పాడే కీర్తనలన్నీ సీతకి వచ్చేశాయి....ప్రతి ధనుర్మాసంలో ఆయన చదివే తమిళ పనసలన్నీ కంఠతా వచ్చాయి.

గర్భగుడి యివతల నుంచుని కన్నార్పకుండా సీతారాముల్ని చూసేది. ఉదయం, సాయంత్రం, రాత్రి....యెప్పుడుచూసినా కదలకుండా నుంచున్న ఆదేవుళ్ళని చూడ్డానికి వచ్చేజనాన్ని చూస్తే సీతకి ఆశ్చర్యంగా వుండేది. టెంకాయలు కొట్టనీ, పూవులు విసరనీ, లేపనీ, పడుకోబెట్టనీ, యేవీ అనరు, రామం అనేవాడు "పాపం. రాముడికి సీతకీ కాళ్ళు పీకవూ అలా నుంచుంటే" అని, చిన్నప్పుడు.

"మనలా యేవిటి........వాళ్ళకి బలం యెక్కువుట" సీత అనేది....

సీత ఆ గుడిచుట్టూ యెన్నో వేల ప్రదక్షణలు చేసింది....ఆ అరుగులమీద కూర్చుని యెంతో కాలాన్ని ఖర్చు చేసింది ....చాలాసార్లు తనని స్కూల్లో చేర్పించేటట్టు తండ్రితో చెప్పమని ప్రతి మలాడింది....

ప్రతిరోజూ వోసారి దేవుడిమొహం, ఆ తరువాత తండ్రివైపూ చూసేది.... ఆమె కోరిక తీరనేలేదు....

సీతకి దేవుడిమీద అప్పుడే కోపం వచ్చింది–మొదటిసారి....

మరోసారి సీతకి దేవుడిమీద అక్కసు కలగడానికి కారణం రామం ఆవూరినుంచి పట్నం వెళ్ళిపోవటం.

"నువ్వెళ్ళద్దు" అంది రామంతో.

"నేను చదువుకుందుకు పోతున్నాను"

ఆ రాత్రి పక్కమీద వాలి మళ్ళీ దేవుడ్ని ప్రాధేయపడింది. అయినా రాముడు సీత మొరవినలేదు. రామం సీతకి దూరం అయ్యాడు.

ఐదారేళ్ళు గడిచాయి. ఆ వూళ్ళో చదువుకున్న వాళ్ళంతా తీరకలేనివాళ్ళు అవడంచేతో, ఆ స్తికులకి వోపికలేక పోవడంవలనో, ధర్మదాతల హృదయాంతరాళాల్లో వేరే చింతలు మొలకెత్తడం మూలంగానో, లేక నాస్తికుల దుష్ప్రచారబలం కారణంగానో రామాలయం స్థితి దిగజారింది.

వారానికో పక్షానికో వోసారి గుడి తలుపులు తెరుస్తాడు నరశింహాచారి.... అదైనా భక్తులన్న వాళ్లు ఒకరిద్దరువచ్చి బలవంత పెడితెనే. మొత్తంమీద భక్తుల రాకపోకలూ, రాబడి తగ్గాయి. సీతకూడా గుడిలాగేవుంది. వెనకటిలా ఆమెకి వుత్సాహంలేదు. పూలు గుచ్చుతుంటే సువాసనలకి బదులు చేతికి రక్తం చిమ్మి మనసు చివుక్కు మంటుంది. తన చిరిగిన చీరమీద వేసుచున్న అతుకులు – చెల్లులు వూడిపోయి వెలవెలబోతున్న గుడి ప్రాంగణలా తోచేది. తనలాగే సీతామ్మవారికి కూడా చీరలు తక్కువ.... అలంకారాలు తక్కువ....అనుకోకూడదనుకున్నా, యెంత తప్పని లెంపలు వేసుకున్నా – అవయవాల సొంపులో తనకన్నా అమ్మవారే నయం. నిండుగా వుంటుందిగుండెలు స్ఫుటంగావుంటాయి. తలుపులు బిగించి, చీకట్లో బంధించినా, నైవేద్యం పెట్టకపోయినా అమ్మవారికి భయంలేదు....పక్కనే అండగా భర్త వున్నాడు.

కానీ, తను ఏకాకి.

చిదికిపోతున్న యింటిలో ఆరిపోతున్న దీపం తను.

* * *

రామాలయం దశ తిరిగింది....ఊళ్ళో ఓ పెద్దమనిషి చనిపోతూ గుడికి యాభైవేల ఆస్తి రాసి పోయాడు....దానితో గుడికి సంస్కరణ మొదలయ్యింది, రాకపోకలు మొదలయ్యాయి....పూజా పునస్కారాలు క్రమం తప్పకుండా జరుగుతున్నాయి.... రామాలయ పునరుద్ధరణ కార్యక్రమం బహూముఖంగా వ్యాప్తి చెందుతోంది.

నరశింహాచారి కళ్ళలో ఆశల దీపాలు వెలిగాయి. వణుకుతూ హారతులు యిస్తూ వుబ్బి తబ్బిబ్బయ్యాడు.

అటు గన్నేరు పూలు దండగా గుచ్చుతూన్న సీత మనసులో కూడా ఆశల మొగ్గలు వేయడం మొదలు పెట్టాయి....

నాలుగైదు రోజులు గడిచాయి.... ఓరోజు తవ్వకాల్లో ముచ్చటైన సీతమ్మ వారి విగ్రహం బయటపడింది. ఐదడుగుల విగ్రహం ముచ్చటగా వుంది.

దాంతో వూరు వూరంతా తరలి వచ్చింది, గుడికి.

వెనకే ప్రభుత్వంవాళ్ళ సిబ్బందీ వచ్చారు.

విగ్రహాల చరిత్రగతుల్ని వివరించే 'ఆర్కియాలజిస్టులు' వచ్చారు.

కిందా మీదా పడి అది ఆరో శతాబ్దం నాటిదనే నిర్ధారణకి వచ్చారు.... అటువంటి విగ్రహం దేశంలో అరుదైనదని అన్నారు. సీత విగ్రహంతో సరి సమానమయిన రామచంద్రమూర్తి విగ్రహం తయారుచేయించడానికి పథకం వేశారు.

జియ్యర్‌గారు వచ్చారు. ఆయన ఆధ్వర్యంలో వూళ్ళో భక్తులు వ్రాసి యిచ్చిన రామకోటి పుస్తకాలు పునాదులుగా వేసి పెద్ద స్తూపం కట్టారు....

ఆ రోజు తీర్థం....

సీత అందంగా తయారయి గుడికీ, యింటికీ మధ్య అరిందలా తిరిగింది.

వచ్చే పోయే వేలాది భక్తుల్లో చిన్నప్పటి స్నేహితుడు రామం వుండటంతో ఆమెకి పరవశం కలిగింది.

"నేను గుర్తున్నానా"

"యెందుకుండవు - రామాన్ని మర్చిపోతుందా సీత"

"నువ్వు చాలా మారిపోయావు"

సీత నవ్వేసింది.

"తవ్వకాల్లో బయటపడ్డ ఆ పంచలోహాల సీతకన్నా నువ్వే అందంగా వున్నావు .... యీ శతాబ్దాల అందం ఎక్కడ దాచి పెట్టుకున్నావు సీతా."

సీత కళ్ళెత్తి చూసింది.

"సీతా"

"యిది గుడి"

"ఏ గుడిలోనూ రావు దొక్కడే వుండడు .... రాత్రిళ్ళు అయితే మీ దేవుళ్ళకి కూడా పవళింపు సేవా అవీ చేస్తారుగా" నవ్వేశాడు....

"కొంటె"

"ఆటవిక మనుషుల్ని తెలివి పరులుగా చేయడానికే యీ గుళ్ళు పుట్టింది"

"చాల్లే.... దేవుడు మనల్నే చూస్తున్నాడు"

"పక్కన అందమైన భార్యని పెట్టుకుని మనల్ని చూసే రాముడు కొంటెవాడు. తెలుసా"

సీత నవ్వేసింది - అటూ యిటూ వూగే గంటలా వుబ్బి తబ్బిబ్బవుతూ -

*   *

వారం పది రోజుల్లో రామం తన మాటలితో సీతని తన హృదయానికి దగ్గరగా తెచ్చుకుని - మరికొన్ని రోజుల్లో తన యింటికి రప్పించుకున్నాడు.

"మా నాన్నకి నా పెళ్ళి గురించి బెంగ."

"స్వయంవరం యేర్పాటు చేస్తే సరి."

"మంచిదే .... కానీ ఆవేళ యీ రామం కాకుండా యే రావణాసురుడో

విల్లు విరిస్తే,"

"రామాయణం ప్రేమాయణం అవకుండా భీకర రామాయణంగా మారుతుంది...."

మరో నెలకి సీత రామాన్ని పూర్తిగా నమ్మడమే కాకుండా అతనికి లొంగిపోయింది.... లొంగి పోవడమేకాదు. బానిస అయ్యింది. చాలా రాత్రయిన తర్వాత రామం, పాయలు వూడిన సీత జుట్టులోని పూలని వెదుకుతూ అన్నాడు.

"సీతా నాదో కోరిక...."

చెప్పు...."

"నాకు సీత కావాలి...."

సీత మత్తుగా నవ్వింది.

"అదే సీతా.... మొన్న తవ్వకాల్లో దొరికిందే ఆ విగ్రహం...."

"నీకు కావాలంటే " నవ్వింది.

"నాకు దాంతో పనుంది."

సీత ఆశ్చర్యంగా చేయి పక్కమీద ఆనించి లేస్తూ,

"యేమిటీ" అంది.

రామం చెప్పిచెప్పనట్టు గొణికాడు.

"జనం ఆ విగ్రహం పోయిందనుకుంటారు. భక్తులన్నవాళ్ళు అమ్మవారు మాయమయిందనుకుంటారు."

"అమ్మో.... మహాపాపం"

"నీది చాదస్తం...."

"అయినా విగ్రహం యెందుకు - బొమ్మని తీసుకువెళ్ళి నువ్వేం చేసుకుంటావు రామం "

"మాటలు నేర్పుతాను, గారడీ చేస్తాను...."

"లంకకి తీసుకు వెడతావా రావణాసురుడా" అతని తల నిమురుతూ అంది. వేళాకోళంగా....

"సీరియస్‌గా అడుగుతున్నాను"

"అంటే...."

"అంతే—"

సీతకి ఏం అర్థం కాలేదు.

"నువ్వు చెప్పమన్నట్లు నాన్నతో చెప్పనా మన పెళ్ళిమాట"

మాట మారుస్తు అంది.

"ముందు నాకు సమాధానం చెప్పు" విసుగ్గా అన్నాడు రామం.

* * *

నరశింహాచారి మొదలు నరికిన మానుఅయ్యాడు.... ఎండి వరుగైన శరీరం లోంచి ఆయాసం, కళ్ళల్లోంచి భయం వరదలై వొకేసారి వురికాయి....

పదివందలు చేయని తన యింటికి లక్షల ఖరీదుచేసే పెద్ద మనిషిరావడం.... పట్టు పీతాంబరాలతో చేత కానుకలతో, పూలూ పళ్ళతో రావల్సిన భక్తుడు— దేవుడిలో తనని లీనం చేసుకోమని ప్రార్థనలు చేయడంపోయి, దేవుడ్ని తనలో లీనం కమ్మని హెచ్చరించడం.

"నే చెప్పినట్టు చెయ్యి....

"అది పాపం."

పెద్ద మనిషి నవ్వేశాడు.... "యేమిటయ్యా పాపం.... దేవుదేం చూడొచ్చాడా. బాగుపడమంటే యేడుస్తావు దేనికి." ఆగి అన్నాడు.

"పదివేలు యిస్తాను.... నువ్వు బాగుపడు.... నీ కూతురి పెళ్ళిచెయ్యి...."

"వద్దు.... నేను కుక్కజన్మ యెత్తలేను...."

"నరశింహాచారి బాగా ఆలోచించు.... యీ విగ్రహం యీ గుడిలో లేనంత

మాత్రాన మనకీ మన వూరికీ వూడి పోయిందేంలేదు. నీ మీదకేం రాదు.... ఆ జాగ్రత్త మేం పడతాం...."

"అయ్యా...."

"రేపు రాత్రి వస్తాను...." పెద్ద మనిషి మాం త్రి కు డి లా మాయ మయ్యాడు....

నరశింహాచారి వీధి తలుపువేసి లోప లికి వెళ్ళాడు.... భయంగా యిల్లంతా చూశాడు....చీకటిమాటున దొంగతనానికి వచ్చి దొరికి పోయిన దొ ం గ లా యిల్లంతా పరుచుకున్న బీదరికం కన్పిం చింది.....

నిద్రపోతున్న కూతురు— చమురు లే క కృ ం గి పో తు న్న దీపశిఖలా కన్పడింది....

రకరకాల ఆలోచనలతో కిటికీ దగ్గ రకు వెళ్ళి నుంచున్నాడు. గుడిలోంచి, యినప తలుపుల వెనక నుంచి కన్పి స్తూన్న శ్రీరాముడి విగ్రహం కళ్ళెర్ర జేసి చూస్తోన్నట్టుగా వుంది....

యెన్నో సంవత్సరాలుగా గుడినీ దేవుణ్ణి నమ్ముకుని బ్రతు కీడుస్తున్నాడు....తను.

కరుణించని దేవుణ్ణి కాదని కాళ్ళదగ్గర కొస్తూన్న ఐశ్వర్యాన్ని చేతికి దక్కించు కోవాలా ....వుహూ....

దేవుణ్ణి అమ్మి జీవితాన్ని బాగుపరచు కోవడమా. లేక దేవుణ్ణి నమ్మి అదృ ష్టాన్ని కాలదన్నాలా .... యేది దారి!! "రామచంద్ర ప్రభూ" అంటూ త ల పట్టుకున్నాడు నరశింహాచారి.

* * *

సీతమ్మవారి విగ్రహం దొంగతనం జరిగిందన్న వార్తతో వూరంతా అట్టు డికినట్టు వుడికిపోయి ం ది. భ క్తు లు ముక్కులమీద వే ళ్ళే సు కు న్నా రు. పెద్దలు విస్తుపోయారు. నాస్తికులు శుష్క వేదాంతులై ఆస్తికుల్ని వే ధిం చడం మొదలుపెట్టారు.

ప్రభుత్వం విభ్రాంతి చెందింది. పోలీ సులు వచ్చారు. రకరకాలుగా నరశింహా చారిని ప్రశ్నించారు.

నరశింహాచారి భయంతో వ ణి కి పోయాడు. అన్నపానాలు మానేశాడు. గుడి అరుగుమీద కూర్చుని కళ్ళల్లో నీళ్ళు నింపుకుని, భుజంమీద కండువాతో నోరు కుక్కుకుంటూ కుమిలి కుమిలి యేడ్చాడు.

యెంత మర్చిపోదామన్నా మనసులో దురూహ గు ర్తుకు వస్తూనేవుంది.

తనకి ముక్తిలేదు.ప్రాయశ్చిత్తంలేదు.

* * *

సీత సంతోష తరంగమై రామం యింటికి వెళ్ళింది.

తనని చూడగానే అలవాటుగా ఎదు రొచ్చి వాటేసుకునే రామం కుర్చీలోంచి లేవకపోవటం అటుంచి. చూడనట్టు తల తిప్పుకోవడం ఆమెకి వింతగా తోచింది.

"రామం" ముద్దుగా పిల్చింది.

"యేమిటి విశేషం" క టు వు గా అన్నాడు.

"స్వాములవారు కో ప ము ద్ర లో వున్నారు"

"సంగతి చెప్పు, విసిగించక."

"జాము రాత్రయ్యింది. సంగతులేం వుంటాయి." నవ్వేసింది సీత.

"అయితే వట్టినే వచ్చావా."

"నీకోసం పొంగలి తెచ్చాను."

"మంచిపని చేశావ్...."

సీత పక్కనే కూర్చుని అంది "రామం నాన్నతో నీ సంగతి చెప్పాను. నాన్న యేమీఅనలేదు..రేపుమాయింటికిరావూ?''

''సీతా! నువ్వెళ్ళు''

"అంటే"—

"నామాట నువ్వు ఖాతరు చేయలేదు''

''నీకు నాకన్నా ఆ విగ్రహం ఎక్కువని తెలుసు''

''తెలిసీ యేం లాభం....నాకు కావల్సింది నువ్వుకాదు....ఆ సీత''

"రామం....సీతమ్మవారి విగ్రహాన్ని యెవరో దొంగలెత్తుకుపోయారు యెంత గొడవజరిగిందో నీకు తెలుసుగా....''

''నాకు తెలుసు. మీ నాన్నకి వాటా లేకుండా యిది జరగదు.''

''రామం'' సీత యేదో చెప్పబోయింది.

''స్నేహితురాలివి కదా నువ్వేదో సహాయం చేస్తావనుకున్నాను''

సీత నవ్వేస్తూ అంది ''ఆ సీతమ్మని యెవరో రావణాసురుడు యెత్తుకుపోయాడు. యీ సీత మాత్రం నీదే....''

"ఆ ఎత్తుకు పోయేవాడు నిన్నుకూడా తీసుకు పోవాల్సింది, పాడుగోల."

"రామం...."

"నువ్వు వెళ్ళొచ్చు."

"అంటే నువ్వు చెప్పేదేం లేదా.."

"లేదు...."

"మనప్రేమ"

"ప్రేమ" రామం విషపు నవ్వు నవ్వేశాడు. "నీకు పెళ్ళి కాలేదు. కాదు కూడా, ఆ విషయం నీకూ తెలుసు. యేదో నాతో నాల్గు రోజులు కాలక్షేపం చేశావు. ప్రేమట.... ట్రాష్...."

సీత కళ్ళప్పగించి రామాన్ని చూస్తోంది. క్రోధంతో. అవమానంతో ఆమె కళ్ళు యెర్రబడ్డాయి.

"ఆ విగ్రహం నీకిస్తే యిలా మాట్లాడే వాడివి కాదు, అవునా...."

రామం మాట్లాడలేదు.

"రామం చిన్నప్పటి స్నేహితుడివి కదా అని నీకు దగ్గరయ్యాను. కానీ నేనుబజారుమనిషిని కాను....కానీనువ్వూ నీ ప్రేమా అంతా నటన.నువ్వు ప్రేమించావనుకున్నాను, నీ ప్రేమ యింత ఖరీదయిందనీ, యింత స్వార్థంతో ముడిపడివుందనీ నాకు తెలియదు....వెడతాను వెళ్ళేముందు ఒకమాట. చెడిపోయినా నేను మనిషిని. కానీ నువ్వుపశువ్వి..గడ్డి తినడం అలవాటయిన పశువుకి అన్నం రుచి చూపించడం నాతప్పు........క్షుద్ర దేవతకి పూజా పునస్కారాలు చేయడం నా పామరత్వం. ...."

సీత త్వరత్వరగా వీధి గుమ్మందగ్గరకి నడిచి – వెనక్కోసారి తిరిగిచూసి ఫిట్ వచ్చినదానిలా నవ్వేసింది.

రామం వింతగా చూశాడు సీతని....

సీత నవ్వాపుకుని వెర్రిగా అరచింది.

"సీతని అవమానించడం ఒకటే రావణాసురిడికి తెలిసిన విద్య,.అదేనువ్వు చేశావు. కానీ సీత మనసెలాంటిదో నేను చెప్తున్నానువిను. నీకోసం, ఆ మహాతల్లి విగ్రహాన్ని నేనే దొంగతనంచేసిదాచాను. పిచ్చిదాన్ని, నీకు కానుకగా యివ్వాలనుకున్నాను.

రామం విస్తుపోయి వింటున్నాడు....

"యిక చచ్చినా ఆ విగ్రహం నీకివ్వను....నా దొంగతనం మూలంగా మా నాన్న నాకు దక్కాడు .... ఘోరతనాన్నుంచి నన్ను నేనూ రక్షించుకున్నాను"

సీత వురుకున వీధిలోపడింది....